
# * షేమ్ షేమ్ *

ఆ నిర్మానుష్య వీధిలోంచి రాత్రిపూట నడుస్తున్నాడు కోటేశ్వర్రావు. హఠాత్తుగా అతన్ని వెనకనుండి ఎవరో గట్టిగా కౌగిలించుకున్నారు. కోటేశ్వర్రావు గుండెకాయ పొట్టలోకి జారింది.




ఎవడో... దారికాచి అటకాయించి దోచుకునేవాడిలా ఉన్నాడు....

అతి ప్రయత్నంమీద గొంతు పెగుల్చుకున్నాడు కోటేశ్వర్రావు.

"బాబ్బాబ్బాబు... నా జేబులో ముప్పయి రూపాయలు ఉన్నాయి... అవి తీస్కుని నన్ను వదిలిపెట్టు" అన్నాడు.

వెనకనుండి పట్టుకున్న వ్యక్తి తన పట్టు ఏ మాత్రం సడలించలేదు. పైపెచ్చు నవ్వాడు.

"హిహి..."

"ముప్పయి రూపాయలు సరిపోదా?...పోనీ నా వాచి కూడా తీస్కో... నన్ను మాత్రం వదిలి పెట్టు... ప్లీజ్ బాబూ..." బ్రతిమలాడాడు కోటేశ్వర్రావు.

"హిహి...హిహిహి..."

వెనకనుండి నవ్వాడా వ్యక్తి.

"వాచీకూడా సరిపోదా?... పోనీ ఉంగరం కూడా ఇచ్చేస్తా... కంగారుపడి

నా పొట్లో కత్తుచ్చుకుని పొడవకు... నా దగ్గరున్నదంతా ఇచ్చేస్తానని అన్నాగా మరి!! ?"

"హిహి... హిహిహి... హ్హిహ్హిహ్హి..."

వెనకున్న వ్యక్తి తన పట్టు వదిలేశాడు. కోటేశ్వర్రావు తేలికగా ఊపిరి పీల్చుకుని వాచి, ఉంగరం తీసి వెనక్కి తిరిగాడు.

ఆ వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు.

శ్రీరాములు!!...

"హోరి!... నువ్వా??...నువ్వేంటి ఇక్కడా?" అడిగాడు కోటేశ్వర్రావు, చిన్ననాటి స్నేహితుడు శ్రీరాముల్ని.

"నేను ఈ ఊరికి ట్రాన్స్ఫరై వచ్చేశాను. మొన్ననే డ్యూటీలో జాయిన్ అయ్యాను. ఈ ఏరియాలో కాస్త పనుండి వచ్చాను... నువ్వేంటి రాత్రిపూట రోడ్లమ్మట తిరుగుతున్నావ్?" అడిగాడు శ్రీరాములు.

"ఏం లేదు... సిగరెట్లు కొనుక్కోవడానికి సెంటర్‌కి వెళ్ళాను... సరేగానీ వెనకనుండి అలా పట్టుకున్నావేం?..."

"చాలా కాలం తర్వాత నిన్ను చూసిన ఆనందంలో కౌగిలించుకున్నా..."

"ఎవరైనా ముందునుండి కౌగిలించుకుంటారు గానీ వెనకనుండి కౌగిలించుకుంటారా ఎక్కడైనా?" బుంగమూతి పెట్టాడు కోటేశ్వర్రావు.

"ముందునుండి కౌగిలించుకోవాలంటే నీ పొట్ట అడ్డొస్తుందిగా మరి!..హి.."

అంటూ చూపుడువేల్తో కోటేశ్వర్రావు పొట్టమీద పొడిచాడు శ్రీరాములు.

"హి..." అన్నాడు కోటేశ్వర్రావు.

"అరే... భలేగా నవ్వుతున్నావే..." అంటూ మళ్ళీ పొట్టమీద పొడవబోయాడు.

కోటేశ్వర్రావు లటుక్కున అతని చేతిని పట్టుకున్నాడు..."చాల్లే... వీధిలో ఈ సరసాలేంటి?... మా ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం పద..." అన్నాడు.

ఇద్దరూ కోటేశ్వర్రావు ఇంటికి వెళ్ళారు.

కాస్సేపు ఆమాటా ఈమాటా మాట్లాడిన తర్వాత "నీ బిజినెస్ ఎలా సాగుతుంది?..." అని కోటేశ్వర్రావుని అడిగాడు శ్రీరాములు.

"ఏమంత బాగా సాగడం లేదు... బిజినెస్‌లో లాస్ వస్తుంది!! ..." అన్నాడు.

"మరెప్పుడు ఏం చెయ్యదలుచుకున్నావ్?"

"వేరే బిజినెస్ ప్రారంభించుదామని అనుకుంటున్నా..."

"ఏం బిజినెస్?" కుతూహలంగా అడిగాడు శ్రీరాములు.

"రాజకీయం బిజినెస్!..." గర్వంగా చెప్పాడు కోటేశ్వర్రావు. "నేను రాజకీయాల్లో చేరిపోయి ఎమ్మెల్యే నయిపోయి... అనక మినిస్టర్ని అయిపోయి కోట్లకి కోట్లు సంపాదిస్తా..."

"నీకెంత మంచి ఆశయం ఉందోయ్..." ఆరాధనగా స్నేహితుడివంక చూస్తూ అన్నాడు శ్రీరాములు. "ఇంతకీ నువ్వు ఏ పార్టీలో చేరాలని అనుకుంటున్నావు?"

"అదే తేల్చుకోలేక పోతున్నాను... జంబలకిడి పంబా పార్టీలో చేరాలా లేకపోతే అద్దిరబన్నా పార్టీలో చేరాలా?... ఎటూ నిర్ణయించుకోలేక పోతున్నా..." అన్నాడు కోటేశ్వర్రావు బుర్ర గోక్కుంటూ.

"నీకసలు రాజకీయ పరిజ్ఞానం చాలా తక్కువనుకుంటా... అసలు మన దేశ ప్రధాని ఎవరు?... ఆ విషయమైనా తెల్సా నీకు?" అన్నాడు శ్రీరాములు.

కోటేశ్వర్రావు శ్రీరాములు వంక సీరియస్‌గా చూశాడు. "ఏం?! ...నేను నీ కళ్లకి అంత వెర్రిబాగులోడిలా కనిపిస్తున్నానా?... మన దేశ ప్రధాని రాజీవ్ గాంధీ అని నాకు తెలీదని ఎందుకనుకుంటున్నావ్?"

శ్రీరాములు కోటేశ్వర్రావ్ కేసి ఓ క్షణంపాటు ఆశ్చర్యంగా చూసి తర్వాత ఘొల్లున నవ్వాడు.

"ఏడ్చినట్టే ఉంది నీ తెలివి!... ప్రస్తుతం మన దేశ ప్రధాని పి.వి. నరసింహారావు!... రాజీవ్ గాంధీ ఏనాడో చచ్చిపోయారు."

ఆ మాట వినగానే కోటేశ్వర్రావ్ ఘొల్లుమన్నాడు.

"ఆ!... నా ప్రియతమ ప్రధాని రాజీవ్ గాంధీ చనిపోయారా?... వా..."

శ్రీరాములు అతన్ని ఓదార్చాడు.

"ఊర్కో ఊర్కో... నువ్వు బొత్తిగా న్యూస్ పేపరు చదవ్వా ఏంటి?... నీకు రాజకీయ పరిజ్ఞానం అస్సలు లేదు..."

కోటేశ్వర్రావు కళ్లు తుడుచుకుని వెక్కాడు.

"నువ్వు ఓ పని చేస్తే మంచిది. పరమానందయ్య అనీ సికింద్రాబాద్‌లో ఉన్నాడు – నువ్వు ఆయన దగ్గరకెళ్ళు." సలహా ఇచ్చాడు శ్రీరాములు.

"పరమానందయ్యా... అయనెవరు?...మన రాష్ట్రపతా?..." అడిగాడు కోటేశ్వర్రావు.

"పరమానందయ్య ఓ సీనియర్ రాజకీయ నాయకుడులే... ప్రస్తుతం రాజకీయాలనుండి రిటైర్ అయ్యారు. అయన నీలా రాజకీయాల్లోకి వెళ్ళాలని అనుకునేవాళ్లకి మంచి సలహాలు ఇచ్చి మార్గం చూపిస్తారు... అవసరం అనుకున్నవాళ్లకి కోచింగ్ కూడా ఇస్తారు... నీకు కోచింగ్ అవసరమేలే..." అని పరమానందయ్య అడ్రసు కోటేశ్వర్రావుకి ఇచ్చి శ్రీరాములు వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడే కోటేశ్వర్రావు పరమానందయ్య ఇల్లు వెతుక్కొని వెళ్లాడు.

"ఊ... నువ్వు రాజకీయాల్లో చేరాలని ఎందుకనుకుంటున్నావ్?..." అడిగాడు కోటేశ్వర్రావుని పరమానందయ్య.

"మరేమో నేను మినిస్టర్ని అయిపోయి బోల్డన్ని అస్తులు సంపాదించాలని అనుకుంటున్నా... హిహి...హిహిహి..." సంబరంగా అన్నాడు కోటేశ్వర్రావు.

"ఊ... ఆలోచన బాగానే ఉంది..." అతన్ని మెచ్చుకోలుగా చూస్తూ అన్నాడు పరమానందయ్య. "ఇంతకీ నువ్వే పార్టీలో చేరాలని అనుకుంటున్నావ్?..."

"ఏమోనండీ... జంబలకిడి పంబా పార్టీలో చేరాలో, అద్దిరబన్నా పార్టీలో చేరాలో తేల్చుకోలేక ఛస్తున్నా... మీరే పార్టీలో చేరమంటే ఆ పార్టీలో చేర్తా..."

"ఆ రెండు పార్టీలూ వద్దులే...నువ్వు లబ్జులకిడి పార్టీలో చేరుదువుగాని!... ఆ పార్టీలో అయితే అందరూ గూండాలే ఉంటారు... వాళ్ళ దగ్గర బోల్డన్ని తుపాకులూ, కత్తులూ, బాంబులూ ఉంటాయ్ ఇంచక్కా..." చెప్పాడు పరమానందయ్య కళ్లు మూస్కొని ఆలోచిస్తూ.

"అలాగేనండి... మీరెలా చెప్తే అలానే... హిహి..." హుషారుగా అన్నాడు కోటేశ్వర్రావు.

"సరేగానీ... రాజకీయాల్లో చేరడానికి నీ అర్హతేంటి?..."

"నాకు బోల్డంత డబ్బుంది..." చెప్పాడు కోటేశ్వర్రావు.

"బోల్డంత డబ్బుంచుకుని మరి రాజకీయాల్లో ఎందుకు చేర్తున్నట్టు?"

"బాగానే ఉందే! నా దగ్గర లక్షలే ఉన్నాయ్... వాటిని కోట్లకి పెంచొద్దా?..."

"శభాష్!..." కోటేశ్వర్రావుని మెచ్చుకున్నాడు పరమానందయ్య."ఇంకా

ఏమేం అర్హతలున్నాయ్?"

"మీరోసారి నా మొహంమీద ఉమ్మెయ్యండి... ఊ... త్వరగా..."మొహం ముందుకు పెడ్తూ అన్నాడు కోటేశ్వర్రావు.

పరమానందయ్య అతని మొహంమీద తుపుక్కున ఉమ్మేశాడు.

కోటేశ్వర్రావు జేబులోంచి కర్చీఫ్ తీసి మొహం తుడుచుకుని పకపకా నవ్వాడు...

"చూశారా... మొహంమీద ఉమ్మేసినా నవ్వుతూ తుడిచేస్కున్నా..." అన్నాడు కులాసాగా.

"ఊ...పరవాలేదుకానీ... ఇవన్నీ పాత స్టాండర్స్... సరేగానీ నీకు బూతులు వచ్చా..."

"ఏదో కొద్ది కొద్దిగా వచ్చు!..." సిగ్గుపడ్తూ అన్నాడు కోటేశ్వర్రావు.

"కొద్దికొద్దిగా అంటే ఎలా? రేప్పొద్దున అసెంబ్లీలో అమ్మనా బూతులు తిట్టుకోవద్దూ?" మందలింపుగా అన్నాడు పరమానందయ్య.

"పోన్లెండి... మన తెలుగు సినిమాలు చూసీ, వారపత్రికలు చదివి మరికాసిన్ని బూతులు నేర్చుకుంటా... అన్నట్టూ అసెంబ్లీలో మైకులూ, బల్లలూ విరక్కొడ్తారంటగా?... ఎమ్మెల్యే అయ్యాక..." జబ్బలు చరుస్తూ అన్నాడు కోటేశ్వర్రావు.

"సర్లేవయ్యా... ఇవన్నీ సెకండరీ విషయాలు... ఇప్పుడంతా హత్యా రాజకీయాలూ...మైకులూ, బల్లలూ విరక్కొట్టడం కాదు... కాళ్ళూ చేతులూ విరక్కొట్టెయ్యాలి! తెల్సిందా?..."

"అమ్మో... నాకు రక్తం చూస్తేనే కళ్లు తిరుగుతాయే... ఎట్టాగబ్బా మరి?..." బుర్రగోక్కుంటూ అన్నాడు కోటేశ్వర్రావు.

"మరేం పర్లేదు... నీకు ట్రైనింగ్ ఇవ్వడానికి నేనున్నానుగా? !..." అభయం ఇచ్చాడు పరమానందయ్య.

పరమానందయ్య కోటేశ్వర్రావుకి ఎలాంటి ట్రైనింగ్ ఇచ్చాడో చెప్తే మీరు గుండెలు బాదుకుంటారు... కేర్ బేర్ మంటారు... అందుకనే చెప్పడంలేదు.

మొత్తానికి కోటేశ్వర్రావు పరమానందయ్యకి ప్రియ శిష్యుడయ్యాడు. పరమానందయ్యకి వీరాంజనేయులు అని మరో ప్రియ శిష్యుడు ఉన్నాడు. పరమానందయ్య తనకంటే వీరాంజనేయులికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నట్టుగా కోటేశ్వర్రావుకి అనుమానం వచ్చింది. ఎలక్షన్‌లో పోటీ

చెయ్యడానికి లబ్జులకిడి పార్టీ టికెట్ పరమానందయ్య వీరాంజనేయులికే ఇప్పిస్తాడేమోనని కోటేశ్వర్రావుకి అనుమానం వచ్చింది.

ఒకవేళ వీరాంజనేయులే లేకపోతే?... అనుకున్నాడు కోటేశ్వర్రావు.

అంతే!... ఓ రోజు రాత్రిపూట వీరాంజనేయులు ఇంటిమీద బాంబు వేసేశాడు కోటేశ్వర్రావు.

ఆ విధంగా అతని రాజకీయ జీవితం ప్రారంభం అయింది.

* * *